మగోడు

డిప్రెషన్‌లో పెళ్లికాని ప్రసాద్‌లు

- అమ్మాయిల ఆలోచనల్లో మార్పులతో తిప్పలు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉండాలంటోన్న యువతులు
- ఐదు అంకెల జీతం ఉంటేనే మూడుముళ్లకు సిద్ధం
- స్వయంవరంలో సంప్రదాయ కులవృత్తుల యువత ఓటమి

సండే స్పెషల్



● మంగళగిరికి చెందిన ఓ యువకుడు సంప్రదాయంగా వచ్చిన వృత్తిని స్వీకరించాడు. అతడు నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నాడు. పదేళ్లుగా సంబంధాలు చూస్తున్నా పెళ్లిచూపులకు కూడా అతడు నోచుకోవడంలేదు. అతడు చేసే వృత్తి గురించి చెప్పగానే ఉద్యోగం లేదా అంటూ అవతలి వైపు నుంచి పెళ్లి ప్రస్తావన ఆగిపోతోంది.

● తెనాలికి చెందిన ఓ యువకుడు బంగారపు పని చేస్తూ నెలకు 70 వేల వరకు సంపాదిస్తాడు. ఇల్లు ఉంది. అయినా పెళ్లి కుదరడం లేదు. బంగారపు పనిచేసుకునే వారికి ఇవ్వం అని అమ్మాయి తరపు వారు తెగేసి చెబుతున్నారు.

● ఓ యువకుడు కార్పెంటర్ పని చేస్తూ నెలకు రూ.40 వేల నుంచి 50 వేలు సంపాదిస్తున్నాడు. కానీ అతడికి 30 దాటినా పెళ్లి కల నెరవేరలేదు. అతడు చేసే పని చెప్పగానే సంబంధాలు వెనక్కి వెళ్లిపోతున్నాయి.

● డిగ్రీ పూర్తి చేసిన ఓ యువకుడు ఓ కంపెనీలో రూ.20 వేల జీతానికి ఉద్యోగం చేస్తున్నాడు. గత ఐదేళ్లుగా రెండు డజన్లకు పైగా సంబంధాలు వచ్చినా అతడికి వచ్చే జీతం చూసి తిరుగుటపాలో వెళ్లిపోతున్నాయి.

పెళ్లి.. పురుషుడికి పగటి కలగా మారుతోంది. అబ్బాయిలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉంటేనే అమ్మాయిలు పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. ఐదు అంకెల జీతం అందుకున్న వారితోనే మూడుముళ్లు వేయించుకుంటున్నారు. కొంతమంది అబ్బాయిలకు పెళ్లి చూపులు.. ఎదురు చూపులుగా మారుతున్నాయి. సంప్రదాయ కులవృత్తులు చేసుకునే వారు, వ్యవసాయం, ఇతర పనులపై ఆధారపడే వారు, చిరు జీత గాళ్లు, కూలి పనులతో జీవనం చేసుకునే యువకులు వివాహ బంధానికి నోచుకోవడం లేదు. తల్లిదండ్రులకు అండగా గ్రామాల్లో, చిన్న చిన్న పట్టణాల్లో ఉంటూ ఏదో ఒక పని చేసుకునే వారు కూడా మూడు ముళ్ల బంధాన్ని మరిచి పోవాల్సి వస్తోంది. దీంతో పెళ్లీడుకు వచ్చిన మగపిల్లలు అనేక మంది డిప్రెషన్‌కు గురవుతున్న సందర్భాలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి.

మాచర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇలా ఒక సంబంధం విషయంలో అయితే పర్వాలేదు.. డజన్ల కొద్దీ సంబంధాలదీ ఇదే పరిస్థితి. సమాజంలో పురుష, స్త్రీ నిష్పత్తిలో వ్యత్యాసాలు రావడంతో అది పెళ్లిళ్లపై పడింది. దీంతో వివాహానికి సంబంధించి గతంలో ప్రాధాన్యాలు అబ్బాయిలకు ఉండగా ఇప్పుడు ఆ అవకాశం అమ్మాయిలు చేజిక్కించుకున్నారు. సంప్రదాయ వృత్తులైన వ్యవసాయం, వడ్రంగం, కుమ్మరి, కమ్మరి, మంగలి, పౌరోహిత్యం తదితర వృత్తులు చేసుకునే యువకులు పెళ్లి పగటి కలలా మారింది. బేల్దారి, టైలరింగ్, ఇతర చిన్న చిన్న పనులు చేసుకుంటూనో.. స్థానికంగా చిరు జీతాలతో ఉద్యోగం చేసుకుంటూనో.. గ్రామాల్లో ఉంటూ వ్యవసాయంపై ఆధారపడే వారు.. కూలి పనులు చేసుకునే వారికి కూడా పెళ్లి సంబంధాలు రావడం లేదు. యుక్త వయసుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పెళ్లంటే ఎంతో ఆశగా మారింది.



● మూడు పదులు దాటినా..

సహజంగా జీవితంలో స్థిరపడ్డాక పెళ్లికి అబ్బాయిలు సిద్ధపడతారు. అయితే గత కొన్నేళ్లుగా ఇలాంటి వారికి సంబంధాలు కుదరడం కష్టంగా మారింది. మూడు పదులు దాటినా పెళ్లి కాని పరిస్థితి మగవాళ్లకు ఎదురవుతోంది. కుల, చేతి వృత్తులపై ఆధారపడిన యువకుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వారికి సంబంధాలు చూడడం, వెదకడమే కష్టంగా మారిపోయింది. వారి పెళ్లి ఊసెత్తగానే అయినవాళ్లు కూడా ముఖం చాటేస్తున్నారు. దూరపు బంధువులు ముఖం మీదే కాదని చెప్పేస్తున్నారు. సంప్రదాయ వృత్తుల్లో ఉండేవారిపై ఆడపిల్లల కుటుంబాల్లో ఆసక్తి తగ్గిపోవడంతో పెళ్లిళ్ల మధ్యవర్తులు కూడా పక్కకు తప్పుకుంటున్నారు. వాళ్లు కనీసం అబ్బాయి ఫొటో, బయోడేటా కూడా తీసుకోవడానికి సుముఖంగా ఉండడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్, వ్యాపార ప్రముఖులు అయితేనో, రూ.కోట్లలో ఆస్తులు ఉంటేనో.. మధ్యవర్తులు సంబంధాలు చూస్తున్నారు.

● ఆడపిల్లల కుటుంబాల్లో విపరీత ధోరణులు

మారిన పరిస్థితుల రీత్యా పెళ్లి కావాల్సిన ఆడపిల్లలకు డిమాండు పెరిగింది. దీంతో ఆడపిల్లల కుటుంబాల ఆలోచనా ధోరణిలో విపరీత మార్పులు కనిపిస్తున్నాయి. సాదా, సీదా సంబంధాలను వారు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఆడపిల్లలు విద్యావంతులు కావడంతో వారి ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది. గతంలోలా కాకుండా తమ అభిరుచులకు తగినవారైతేనే సంబంధానికి ఓకే చెబుతున్నారు. ఆర్థికంగా మెరుగైన, సుభిక్షమైన జీవితాన్ని కోరుకుంటూ అందుకనుగుణంగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. దీంతో సాదా, సీదా ఉద్యోగాలు చేసే వారికి, సంప్రదాయ, కుల వృత్తులను నమ్ముకున్నవారికి పెళ్లిళ్లు గగనమైపోయాయి.



చార్టర్డ్ అకౌంటెంట్లకు గుంటూరు హబ్ కావాలి

- అత్యుత్తమ ప్రతిభతో సీఏల తయారీకి ప్రభుత్వం కృషి
- విద్యార్థులకు అవగాహనా సదస్సులో మంత్రి లోకేశ్

గుంటూరు(విద్య), జూలై 19 (ఆంధ్రజ్యోతి): చార్టర్డ్ అకౌంటెంట్లను తయారు చేసే హబ్‌గా గుంటూరు కావాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం గుంటూరు అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో సీఏ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో లోకేశ్ ప్రసంగించారు. గుంటూరులో వైద్యం, ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారికంటే సీఏ అభ్యసించేవారే ఎక్కువగా ఉన్నారన్నారు. సీఏ చదివేందుకు ఏటా 10 వేల మంది గుంటూరు రావడం హర్షణీయమన్నారు. అత్యుత్తమ ప్రతిభ, అధిక ఉత్తీర్ణతా శాతంతో, సమున్నత లక్ష్యాలు కలిగిన చార్టర్డ్ అకౌంటెంట్లను తయారు చేయాలని, ఇందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భారతదేశం గర్వపడేలా గుంటూరు నుంచి గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు చార్టర్డ్ అకౌంటెంట్లు ప్రతిభ చాటుతున్నారన్నారు. ఇష్టపడి చదివితే సీఏ కోర్సులు పూర్తి చేయడం కష్టతరం కాదన్నా రు. కష్టతరమైనా యువతను సీఏ ఉన్నత శిఖరాల్లో నిలబెడుతుందన్నారు. ఈ సమా వేశంలో గుంటూరు పశ్చిమ, తాడికొండ ఎమ్మెల్యేలు గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ డీ ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ (ఎస్ఐఆర్‌సీ) వైస్ ఛైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, గుంటూరు బ్రాంచి ఛైర్మన్ ఎన్ రాజశేఖర్, సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్ఐసీఏఎస్ఏ) గుంటూరు బ్రాంచ్ ఛైర్మన్ చింతా రఘునందన్, వైస్‌ఛైర్మన్ బీ ఝాన్సీలక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి వీ నరేశ్, ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్, వేదికపై ఎమ్మెల్యే మాధవి, తదితరులు

సైబర్ నేరాలను అరికట్టాలి

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించాలి

- నేర సమీక్షలో కలెక్టర్ అరుణ్‌బాబు
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువ : ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలను అరికట్టేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నేర సమీక్షలో కలెక్టర్ ప్రసంగించారు. నేరాలపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి వారికి ఏదైనా సమస్య వస్తే పోలీస్ శాఖ ఉందనే నమ్మకాన్ని కల్పించాలన్నారు. బాలికలు, మహిళలు, వృద్ధులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. పోక్సో కేసులకు సంబంధించి విద్యా సంస్థల్లో, డ్రగ్స్, గంజా అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. రేషన్ బియ్యం, ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాలన్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ సాంకేతికతను అందుపుచ్చుకుంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రజలకు చేరువ అవుతున్నట్లు చెప్పారు. వ్యాపార సముదాయాలతో పాటు నేరాలు జరుగుతున్న ప్రాంతాల్లో సీసీ కెమేరాలు తప్పనిసరిగా అమర్చాలన్నారు. మత్తుపదార్థాలు, డ్రగ్స్, గుట్కా విక్రయంపై నిరంతరం దాడులు చేస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు పెంపొందేలా పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. 13వ అదనపు జిల్లా న్యాయాధికారి డాక్టర్ ఎన్ సత్యశ్రీ మాట్లాడుతూ నేరాలపై వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలన్నారు. అనంతరం కేసుల చేదనతో పాటు వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణి కంఠ, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, డీఈవో చంద్రకళ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు, వేదికపై కలెక్టర్ అరుణ్‌బాబు

వచ్చే నెలలోనే సాగునీరు

- ఆగస్టు తొలి వారంలో కుడి కాల్వకు విడుదల
- వరి సాగు తగ్గించి.. ఉద్యాన విస్తీర్ణం పెంచాలి
- సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయాలు

నరసరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు ఆగస్టు మొదటి వారంలో సాగు నీరు విడుదల చేయాలని సాగునీటి సలహా మండలి నిర్ణయించింది. జోన్-1కు తొలి దశలో నీటి సరఫరాకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తీర్మానించారు. పల్నాడు కలెక్టరేట్‌లో శనివారం జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ అధ్యక్షతన సాగునీటి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ ఏసురత్నం, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్ ఛైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి హాజరయ్యారు. ఖరీఫ్ పంటల సాగుపై ప్రధానంగా చర్చించారు. వరి సాగు తగ్గించి ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాలని పలువురు సూచించారు. పొగాకు కంపెనీల నుంచి అనుమతి పత్రాలు ఉంటేనే బర్లీ పొగాకు సాగు చేయాలని రైతులకు సూచించారు.


సమావేశంలో చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యేలు యరపతినేని, అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన, పీసీ ఛైర్మన్ పులుకూరి, వైస్ ఛైర్మన్ చక్రపాణి, తదితరులు

పోస్టులను భర్తీ చేయాలి

సాగర్ కుడి కాల్వ పరిధిలో ఉద్యోగుల కొరత ఉందని, లస్కర్, ఏఈ, జేఈ పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరారు. 3,500 ఎకరాలు ఉన్న బుగ్గవాగు ఆక్రమణలకు గురై.. రెండు వేల ఎకరాలకు తగ్గిందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యం 5 టీఎంసీలకు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 30 శాతం మాత్రమే కాల్వల ఆధునికీకరణ పూర్తయిందని, చివరి భూములకు నీరు అందడం లేదని పీసీ వైస్ ఛైర్మన్ చక్రపాణి తెలిపారు. అధికారులు, నీటి సంఘాల సమన్వయంతో చివరి భూములకు నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు.

కార్యాలయానికి శంకుస్థాపన

కలెక్టరేట్ సమీపంలో కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ కార్యాలయ భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.50 లక్షలతో భవనం నిర్మించనున్నారు.


ఈదర మైనర్ - 1లో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

ఎన్ఎస్‌పీ కాల్వలకు మహర్దశ

- పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానం
- రెండు విడతలుగా రూ.2.78 కోట్లతో పనులు

నూజెండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల తర్వాత ఎన్ఎస్‌పీ కాల్వలకు మహర్దశ పట్టింది. విడతల వారీగా మంజూరైన నిధులతో సిల్ట్ తొలగింపు, కట్టలను బలపరచడం, రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం మరమ్మతులకు నిధులు కేటాయించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఆధునికీకరణలో భాగంగా పదేళ్ల క్రితం కాల్వ మరమ్మతులు జరిగాయి. ఆ తర్వాత కాల్వలను పట్టించుకోలేదు. దీంతో కంప చెట్లతో కాల్వలు అడవులను తలపించాయి. చివరి భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని నెలల క్రితం కాల్వల మరమ్మతులకు రూ.1.50 కోట్ల మేర ఖర్చు చేశారు. ప్రస్తుతం జమ్మలమడక మేజరు పరిధిలోని ములకలూరు డీసీ, నీటి సంఘాలకు 14 పనులకు రూ.60 లక్షలు, డీసీ- 29 త్రిపురాపురం మేజరు పరిధిలో 8 పనులకు రూ.24 లక్షలు, డీసీ- 28 ఐనవోలు 9 పనులకు రూ.44 లక్షలు మంజూరు చేశారు. దీంతో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌లు, నీటి సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో కాల్వల్లో సిల్ట్, కంప చెట్ల తొలగింపు, కట్టలను బలపరచడం, రైతులు రాకపోకలు సాగించేలా కాల్వ కట్టలపై బాటలను ఏర్పాటు చేస్తున్నారు.

17 లారీలు రూ.42 లక్షలు!

- గ్రానైట్ అక్రమ రవాణా లారీలకు పన్ను, జరిమానా
- జీరోపైనే జిల్లా సరిహద్దులు దాటుతున్న గ్రానైట్
- నెలకు రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రానైట్ రవాణాలో జీరో దందాకు ఫైన్ పడింది. ఎట్టకేలకు ప్రభుత్వానికి రూ.42 లక్షల వరకు ఆదాయం లభించింది. బిల్లులు లేకుండా అంతా జీరోపైనే గ్రానైట్‌ను జిల్లా సరిహద్దులను దాటిస్తున్న అక్రమార్కులు అధికారులకు చిక్కారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రెండు విడతల్లో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 19 గ్రానైట్ లారీలను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సీజ్ చేశారు. ఇందులో..17 లారీల్లో ఉన్న గ్రానైట్ విలువ ఆధారంగా.. లారీకి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పన్నుతో పాటు జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. మరో రెండు లారీలకు సంబంధించి గ్రానైట్ విలువ ఆధారంగా పన్ను, జరిమానాను వసూలు చేయనున్నట్లు సదరు అధికారి తెలిపారు. ఈ లారీలను వదిలేయాలని అధికార పార్టీ నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తూ పన్ను ఎగవేసేందుకు యత్నిస్తున్నారు. ఈ రెండు లారీలకు కూడా నిబంధనల మేర జరిమానా వసూలు చేస్తే రూ.4.50 లక్షలు నుంచి రూ.5 లక్షల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకావం ఉంది.


వాణిజ్య పన్నుల శాఖ జరిమానా విధించిన గ్రానైట్ లోడ్‌లో ఉన్న లారీలు

ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి..

ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెబుతున్న పాలకులు ప్రభుత్వ ఖజానకు వచ్చే ఆదాయాన్ని వదిలేయడాన్ని ఎలా చూడాలి. ఉదాహరణకు రోజు 70 నుంచి 100 లారీల గ్రానైట్ అక్రమంగా జిల్లా సరిహద్దులు దాటిపోతోంది. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా ఎగవేస్తున్నారు. ఈ అక్రమార్కులకు ప్రభుత్వంలోని కొందరు పెద్దల అండదండలు ఉండ టంతో.. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చర్యలు తీసకోకుండా వది లేస్తున్నారు. ఒక్కో లారీలో రూ.3లక్షల నుంచి రూ.3.50 లక్షల విలువైన గ్రానైట్‌ను అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. ప్రభుత్వానికి లారీకి 18 శాతం చొప్పున పన్ను చెల్లించాలి. అంటే రూ.3 లక్షల విలువైన గ్రానైట్ తరలించే లారీ నుంచి రూ.54 వేలు పన్ను చెల్లించాలి. ఇలా పన్ను వసూలు చేస్తే కనీసం 50 లారీలకు రోజుకు రూ.27 లక్షల చొప్పున.. నెలకు రూ.8 కోట్లకు పైగా ఆదాయం ఒక్క పల్నాడు జిల్లా గుండా వెళ్లే గ్రానైట్ లారీల నుంచి ప్రభుత్వం కోల్పోతోంది. ఇంత ఆదాయం పోతున్నా ప్రభుత్వం, పెద్దలు నోరు మెదపకపోవ డం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తరహాలోనే ప్రస్తుత అధికార పార్టీలోని కొందరు ముఖ్యులు గ్రానైట్ అక్రమ రవాణాను ప్రోత్సహి స్తున్నారు.

ఐదు గ్రానైట్ లారీలు స్వాధీనం


నడికూడి మార్కెట్ యార్డులో అధికారులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీలు

దాచేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న ఐదు లారీలను సేల్ ట్యాక్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ సమీపంలోని ఆంధ్రా, తెలంగాణ బోర్డర్‌లో కృష్ణా నది బ్రిడ్జిపై లారీలను ఆకస్మికంగా అధికారులు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్లు, వారి సహాయకులు సేల్స్ ట్యాక్స్ అధికారు లతో ఘర్షణ పడ్డారు. దీంతో అధికారులు స్థానిక పో లీసులకు సమాచారం ఇవ్వడంతో వారు.. ఘట నా స్థలానికి చేరుకొని పట్టుకున్న లారీలను నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించారు.

ప్రజల్లో విషబీజాలు నాటేందుకు వైసీపీ పన్నాగం : ఎమ్మెల్యే పుల్లారావు
విద్యార్థి దశ సద్వినియోగంతోనే ఉజ్వల భవిష్యత్తు
- జస్టిస్ జ్యోతిర్మయికి విజయలక్ష్మి స్మారక పురస్కారం
మాచవరం పెట్రోల్ బంకులో తనిఖీలు
7

జగన్ మెక్కిన సొమ్మంతా కక్కిస్తాం!

» బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు: నిమ్మల

చోడవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో అక్రమాలతో జగన్ అండ్ కో లూటీ చేసిన రూ.40 వేల కోట్ల ప్రజాధనాన్ని ఈ ప్రభుత్వం కక్కించకుండా వదిలిపెట్టబోదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం అనకాపల్లి జిల్లా చోడవరానికి వచ్చిన ఆయన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇసుక, ఖనిజాలు, వనరుల దోపిడీతో పాటు, మద్యం వ్యాపారంలో కోట్లాది రూపాయలు స్వాహా చేసిన జగన్.. ఆ తప్పులకు శిక్ష తప్పదన్న భయంతోనే రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బనకచర్ల వల్ల తెలంగాణకు



ఎలాంటి నష్టమూ ఉండదని తెలంగాణలోని రాజకీయ నాయకులు, మేధావులు, రైతులు, నీటి పారుదల రంగ నిపుణులు, జర్నలిస్టులు.. అందరికీ తెలుసన్నారు. అక్కడి రాజకీయ పార్టీల ఆధిపత్య పోరులో భాగంగానే బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు సారథ్యంలో ఏడాది పాలన పట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని నిమ్మల తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో 2027 డిసెంబరు నెలాఖరుకల్లా పోలవరాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో రాజారెడ్డి రాజ్యాంగం

» ప్రజలు తిరస్కరించి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తెచ్చారు: మంత్రి గుమ్మడి

కొయ్యలగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు రాజారెడ్డి రాజ్యాంగం నడిచింది. ప్రజలు తిరస్కరించి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ఏర్పాటు చేశారు. ఆ ఐదేళ్లు రాష్ట్రం అన్నింటా వెనుకబడింది' అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ధ్వజమెత్తారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో శనివారం ఆమె పాల్గొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ 'టీడీపీ ప్రభుత్వం వచ్చాక రూ.1,300 కోట్లతో రోడ్లు నిర్మించాం. గిరిజన ప్రాంతాలను డోలి లేని ప్రాంతాలుగా చేయాలనే లక్ష్యంతో మరో రూ.1,000 కోట్లతో రోడ్లు నిర్మిస్తాం. రూ.146 కోట్లతో గిరిజన సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నాం' అని పేర్కొన్నారు.

జగన్‌వి విలువల్లేని రాజకీయాలు: అనిత

విజయనగరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): జగన్ 2019 నుంచి 2024 వరకు విలువల్లేని రాజకీయాలు చేయడం వల్లే అధఃపాతాళానికి వెళ్లారని హోంమంత్రి అనిత అన్నారు. గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజును శనివారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, అయ్యన్న, అశోక్ గజపతిరాజు వంటి వారిని లక్ష్యంగా చేసుకుని జగన్ కుతంత్రాలు చేశారన్నారు.

ఆంధ్రతో మా ప్రయాణం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

'తెలుగు ప్రకటన అద్భుతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ మీ వాహనాలకు అతిపెద్ద మార్కెట్. ఈ ప్రకటనను కూడా ప్రజలు తప్పకుండా ఇష్టపడతారు. అత్యాధునిక ఆటోమోటివ్ వ్యవస్థ, అతి పెద్ద మార్కెను ఉపయోగించుకోవడానికి మా రాష్ట్రంలో వాహన తయారీ పరిశ్రమ స్థాపనకున్న అవకాశాలను పరిశీలించండి. మీ బృందాన్ని స్వాగతించడానికి, మా వద్దనున్న అవధులులేని అవకాశాలను వివరించడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. లోకేశ్ సందేశానికి ఆనంద్ మహీంద్ర స్పందిస్తూ... 'ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. ఏపీ ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములం కావడం మాకు గర్వకారణం. ఇప్పటికే మా బృం దాలు పలు రంగాలు.. సౌరవిద్యుత్, మైక్రో ఇరిగేషన్, పర్యాటకంలో పె ట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నాయి. మన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది... ముందు ఏమి ఉందో చూద్దాం.!' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

తక్కువ ఖర్చుతోనే గ్రీన్ హైడ్రోజన్

ఏపీలో మూడు పరిశోధన క్లస్టర్లు.. ఏపీ అసోసియేషన్ ఏర్పాటవ్వాలి

» అమరావతి సమ్మిట్ డిక్లరేషన్

» రేపు ప్రభుత్వానికి నివేదన

» ఏపీలో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన మరో సంస్థ



గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ ముగింపు రోజున చర్చల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, నిపుణులు

గుంటూరు/మంగళగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడానికి విస్తృతంగా పరిశోధనలు జరగాలని గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ అభిప్రాయపడింది. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజులు జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ శనివారం ముగిసింది. రెండో రోజు మేధావులు పలు అంశాలపై చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు గ్రీన్ హైడ్రోజన్ పరిశోధన క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి, జాతీయ స్థాయిలో వలే గ్రీన్ హైడ్రోజన్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్‌ను నెలకొల్పడానికి, హరిత ఉదజని ఉత్పత్తి ఖర్చును సగానికి తగ్గించేందుకు నిరంతరం పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు రాష్ట్రంలో కొనసాగించడానికి ఈ సదస్సులో డిక్లరేషన్ రూపొందించారు. ఆ డిక్లరేషన్‌ని సోమవారం ప్రభుత్వానికి నివేదించనున్నారు. సదస్సులో చర్చించిన అంశాలను ఎస్ఆర్ఎం గ్రూపు సంస్థల రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.నారాయణరావు వివరించారు. తొలి రోజు సీఎం సమక్షంలో జరిగిన రూ. 51 వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలతో పాటు అమెరికాకు చెందిన సినర్జెన్ సీఈవో ప్రణవ్ తాంతి ఆంధ్రప్రదేశ్‌లో మరో 40 వేల టన్నుల సామర్థ్యం గల గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం తెలిపారని చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చుని రూ. 400 నుంచి రూ. 200కు తగ్గించాలని, వచ్చే రెండు, మూడేళ్లలో హైడ్రోజన్‌తో నడిచే కారు, రైలుని వినియోగంలోకి తీసుకురావాలని డిక్లరేషన్‌లో పొందుపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో-వైస్‌చాన్సలర్ డాక్టర్ సతీష్‌కుమార్, నెడ్‌క్యాప్ ఏపీ ఎండీ కమలాకర్‌బాబు, సుజిత్ ఎంఎస్ఆర్‌ఈ నుంచి డాక్టర్ సుజిత్ పిళ్లై, మారం పార్థసారథి, సుజిత్ కల్లూరి పాల్గొన్నారు.

అమరావతిలో హైడ్రోజన్ వ్యాలీ



అమరావతిలో హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటుపై రెండో రోజు డిక్లరేషన్ ప్రవేశపెట్టడం జరిగింది. రెండు రోజుల సమ్మిట్‌లో ప్రముఖల అభిప్రాయాలు, చర్చకు వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని డిక్లరేషన్‌ను రూపొందించాం. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆర్ అండ్ డీ ప్రతినిధులు, వివిధ సంస్థలు, సైంటిస్టులు, ప్రొఫెసర్లు సమ్మిట్‌కు హాజరయ్యారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ అభివృద్ధి, వివిధ పాలసీలపై చర్చించారు. అమరావతికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ వస్తే రాజధాని ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుంది.

-డాక్టర్ పార్థసారథి (సమ్మిట్ కన్వీనర్, ఎస్ఆర్ఎం)

భవిష్యత్తులో శిలాజ ఇంధనాల కొరత



ప్రస్తుతం మనం వినియోగిస్తున్న శిలాజ ఇంధనాలు భవిష్యత్తులో దొరక్కపోవచ్చు. ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేసుకోవాలి. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, టెక్నాలజీ అభివృద్ధి, స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతోంది. పంట వ్యర్థాలతో స్థిరమైన ఇంధన శక్తిని ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నాయి.

- డాక్టర్ మల్లికార్జునరావు (సీఈవో, శక్తి ఫోటాన్ సొల్యూషన్స్)

కార్బన్ రహిత సమాజానికి దోహదం



కార్బన్ రహిత సమాజానికి గ్రీన్ హైడ్రోజన్ ఒక ఆశాజనకమైన మార్గం. గ్లోబల్ వార్మింగ్ విపత్తు నుంచి బయట పడాలంటే హైడ్రోజన్ ఇంధన వనరులను గణనీయంగా ఉత్పత్తి చేయాలి. ఇప్పుడున్న టెక్నాలజీతో గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకుంది. దాని స్టోరేజీ, ట్రాన్స్‌పోర్టేషన్, వనరుల వినియోగం కూడా ప్రధానం. ఈ అంశాలపై సదస్సులో నిపుణులు చర్చించారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. విశాఖపట్నం, కాకినాడలో త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి.

- అనిల్‌కుమార్ (ఆర్ అండ్ డీ డీన్, తిరుపతి ఐఐటీ)

మున్సిపల్ కమిషనర్ పేరుతో వసూళ్లు!

వ్యాపారులకు క్యూఆర్ కోడ్ పంపి డబ్బులు స్వాహా

తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కేసులు నమోదు

నెల్లూరులో అరెస్టు చేసిన దర్గామిట్ట పోలీసులు

నెల్లూరు(క్రైం), జూలై 19(ఆంధ్రజ్యోతి): దొంగతనాలు, దోపిడీలతో రిస్కు అనుకున్నాడో ఏమో.. కాలు కదల్చకుండా దర్జాగా నగదు దోచుకోవడానికి ప్రణాళిక వేశాడో ఓ ప్రబుద్ధుడు. ఏకంగా మున్సిపల్ కమిషనర్ అవతారం ఎత్తి, పన్ను బకాయిలు చెల్లించాలంటూ వ్యాపారులను బెదిరించి, దోచుకోవడం మొదలుపెట్టాడు. ఈ కేటుగాడిని నెల్లూరు దర్గామిట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వైఎస్ఆర్ కడప జిల్లా బీ కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన బిల్లా నాగేశ్వరరావు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ పేరిట ఫోన్‌చేసి వాణిజ్య పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని ఒత్తిడి చేసేవాడు. వారి మొబైల్ ఫోన్లకు తన బ్యాంకు ఖాతా క్యూఆర్ కోడ్ పంపి అందులో డబ్బులు వేయించుకునేవాడు. నెల్లూరుకు చెందిన హైరర్స్ యజమాని రియాజ్ బాషాకు గతనెల 17న నిందితుడు ఫోన్ చేశాడు. వారి సంస్థ పేరుపై రూ.2,100 మున్సిపాలిటీకి బకాయి ఉందని, వెంటనే తాను పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి నగదు చెల్లించాలని ఆదేశించాడు. ట్రేడ్ లైసెన్స్ చెల్లించామని రియాజ్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో ఆయన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నగదు చెల్లించారు. కొద్దిసేపటి తర్వాత నిందితుడు మళ్లీ ఫోన్ చేసి మరో రూ.1,200 చెల్లించాలని కోరాడు. దీంతో అనుమానం వచ్చిన రియాజ్ నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. దీనిపై బాధితుడు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నెల్లూరులోని పొదలకూరు రోడ్డు వద్ద నిందితుడు బిల్లా నాగేశ్వరరావును అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రోశయ్య చెప్పారు. కాగా, నిందితుడిపై బీ కోడూరు, బద్వేలు, కడప, గుంతకల్, తెలంగాణలోని గద్వాలలో కేసులు నమోదయ్యాయి.

అతనికి బెయిల్ ఇవ్వలేం!



» యజమాని భార్యను హత్య చేసి.. శవంతో వాంఛ తీర్చుకున్న వ్యక్తి

» బెయిల్ నిరాకరించిన హైకోర్టు

» మృగంలా వ్యవహరించాడని వ్యాఖ్య

» బెయిల్ ఇస్తే సమాజంపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న న్యాయస్థానం

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న ఆసుపత్రి యజమాని భార్యను హత్య చేసి, అనంతరం ఆమె మృతదేహంతో లైంగిక వాంఛ తీర్చుకున్న వ్యక్తికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇలాంటి కేసులో బెయిల్ మంజూరు చేస్తే సమాజంపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. యజమాని భార్యపై లైంగిక వ్యామోహంతో నిందితుడు మృగంలా వ్యవహరించాడని, ఆమె ప్రతిఘటించడంతో విషయం బయట పడుతుందని దారుణంగా హత్య చేశాడని కోర్టు తెలిపింది. అనంతరం, మృతదేహంతో కామవాంఛ తీర్చుకున్నాడని పేర్కొంది. దీనికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, వాస్తవాలను ట్రయల్ కోర్టు తేలుస్తుందని తెలిపింది. చాలాకాలం నుంచి జైలులో ఉన్నాడనే కారణంతో ఇలాంటి తీవ్రమైన కేసులో బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడని తేల్చి చెప్పింది. నేరానికి పాల్పడిన విధానం, నేర తీవ్రత, సమాజంపై చూపించే ప్రభావం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు జిల్లా కావలిలో ఓ వైద్యుడు 15 ఏళ్లుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నిందితుడు నయన్ బిస్వాస్ ఈ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా చేరారు. యజమాని కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న అతను 2024, డిసెంబరు 31 తెల్లవారు జామున యజమాని భార్యపై లైంగిక వాంఛ తీర్చుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వాంఛ తీర్చుకున్నాడు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కావలి వన్‌టౌన్ పోలీసులు నయన్ బిస్వాస్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసి ప్రాథమిక చార్జిషీట్ దాఖలు చేశారు. కారాగారంలో ఉన్న నిందితుడు బిస్వాస్ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేసినందున బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.

కూటమి ప్రభుత్వ కృషిని

ప్రజల్లోకి తీసుకెళ్లండి

» మాధవ్‌కు జేపీ నడ్డా దిశానిర్దేశం

న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ కృషిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పీవీఎన్ మాధవ్‌కు దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మాధవ్, నడ్డాతో శనివారం ఢిల్లీలో భేటీ అయ్యారు. క్షేత్ర స్థాయిలో పార్టీని పటిష్ఠం చేయడం, రాష్ట్రాభివృద్ధికి కూటమి సర్కారు నిరంతరం శ్రమిస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని నడ్డా సూచించారు. సమష్టి కృషితో పార్టీని మరింత పటిష్ఠం చేస్తానని మాధవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కేరళలో పాట చిత్రీకరణ



మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('మెగా157-వర్కింగ్ టైటిల్)' షూటింగ్ కేరళలో శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం కేరళలోని అందమైన లోకేషన్లలో చిరంజీవి, నయనతారపై పెళ్లి నేపథ్యంలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. 'కొన్ని కీలకమైన ఘట్టాలను కూడా ఈ షెడ్యూల్‌లో షూట్ చేస్తున్నాం, ఈనెల 23 నాటికి ఈ షెడ్యూల్ పూర్తవుతుంద'ని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

గాయపడిన షారుక్..

షూటింగ్‌కు బ్రేక్



సినిమా కోసం చెమటోడ్చే హీరోల్లో షారుక్ ఖాన్ ముందుంటారు. ప్రేక్షకులను అలరించడానికి మూడు దశాబ్దాలుగా ఆయన కృషి చేస్తూనే ఉన్నారు. 60 ఏళ్ల వయసులోనూ తెరపై షారుక్ చేసే సాహసాలు అబ్బురపరుస్తూంటాయి. డూప్ లేకుండా యాక్షన్ సీన్లలో పాల్గొనే షారుక్ తాజాగా 'కింగ్' చిత్రం షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. ముంబైలోని గోల్డెన్ టుబాకో స్టూడియోలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ తీస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. అయితే ఇది తీవ్రమైన గాయం కాదు, కండరానికి సంబంధించింది కనుక చికిత్స అవసరం అని అమెరికాకు ఆయన్ని తీసుకెళ్లారు. నెల రోజుల పాటు షారుక్‌కు విశ్రాంతి అవసరమని వైద్యులు వెల్లడించారు. దీంతో ఆగస్టు నెల వరకూ ఏకధాటిగా జరగాల్సిన 'కింగ్' షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చారు. షారుక్ కోలుకుని తిరిగి వచ్చిన తర్వాత సెప్టెంబర్‌లో కానీ అక్టోబర్‌లో కానీ మళ్లీ షూటింగ్‌ను ప్రారంభిస్తామని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఇండియాతో పాటు యూరప్‌లో కూడా 'కింగ్' షూటింగ్ జరపాలని ప్లాన్ చేశారు. షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ప్రధాన పాత్ర పోషిస్తున్న 'కింగ్' చిత్రాన్ని సిద్ధార్థ్ ఆనంద్ రూపొందిస్తున్నారు.

ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రం

- నిర్మాత ఏ.ఎం.రత్నం



'మొఘల్ సామ్రాజ్య చక్రవర్తుల కాలంనాటి కథే 'హరిహర వీరమల్లు'. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా ఇది నిజ జీవిత కథ కాదు. ఓ కల్పిత పాత్రను తీసుకొని, దాని చుట్టూ కథ అల్లాము. హరిహర అంటే విష్ణువు, శివుడు కలయిక. ఆ రెండు పేర్లు సూచించేలా వీరమల్లు అని పెట్టాము. 'హరిహర వీరమల్లు' ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే గొప్ప చిత్రం అవుతుంది' అని అన్నారు నిర్మాత ఏ.ఎం. రత్నం. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఆయన నిర్మించిన 'హరిహర వీరమల్లు' ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

- నేను 'భారతీయుడు' సహా ఎన్నో భారీ చిత్రాలను నిర్మించాను. అయితే నా సినీ జీవితంలో ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసిన సినిమా ఇదే. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. షూటింగ్ పూర్తవడానికి బాగా ఆలస్యమవడంతో సినిమా ఎలా ఉంటుందోననే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. అయితే ట్రైలర్ విడుదలతో వారి అనుమానాలు పటాపంచలు అయ్యాయి. నేను నిర్మించిన సినిమాల్లో 90 శాతానికి పైగా విజయం సాధించాయి. ఆ అనుభవంతో చెబుతున్నా... 'హరిహర వీరమల్లు' ఘన విజయం సాధిస్తుంది.
- సినిమాను మొదట రెండు భాగాలు అని అనుకోలేదు. సినిమా వినోదంతో పాటు, సందేశాన్ని అందించాలనేది నా భావన. నేను రూపొందించిన సినిమాలు అలాగే ఉంటాయి. చారిత్రక నేపథ్యమున్న కథ. ఇలాంటి గొప్ప కథలో సందేశం ఉంటే..ఎక్కువ మందికి చేరువవుతుందని భావించాము. అలా చర్చలో కథ విస్తృతి పెరిగింది.
- 'ఖుషి, 'బంగారం' తర్వాత పవన్ కల్యాణ్‌తో చేసిన మూడో చిత్రమిది. పేరుకు మూడు సినిమాలే కానీ.. మా మధ్య 25 ఏళ్ల అనుబంధం ఉంది. పవన్ కల్యాణ్‌ని దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా.. ఓ నటుడిగా కంటే కూడా మంచి ఆశయాలున్న మనిషిగా ఆయనను నేను ఎక్కువగా ఇష్టపడతాను.
- మా అబ్బాయి అని చెప్పడం కాదు గానీ.. జ్యోతికృష్ణ దర్శకత్వ ప్రతిభ చూసి ఆశ్చర్యపోయాను. మేమందరం చూడని ఓ కొత్త కోణంలో ఈ కథని సిద్ధం చేశాడు. మన చరిత్రను ముడిపెడుతూ ఈ తరానికి చేరువయ్యేలా 'ఇండియానా జోన్స్' తరహాలో సినిమాని గొప్పగా మలిచాడు.

ఏపీలో 'హరిహర వీరమల్లు' టికెట్ ధర పెంపు

● 14 రోజులు అడిగిన మేకర్స్.. పది రోజులకే అనుమతి..

'హరిహర వీరమల్లు' టికెట్ ధరలు పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 24న థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ సినిమాకు 14 రోజుల పాటు అదనపు రేట్లకు అనుమతించాలని ప్రభుత్వానికి మేకర్స్ విన్నవించారు. పరిశీలించి పది రోజుల పాటు పెంపునకు అనుమతిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 23 రాత్రి 9.30 గంటలకు సెకండ్ షో, 24వేకువ జామున 4గంటలకు బెనిఫిట్ షోలకు అనుమతి పెండింగ్‌లో పెట్టింది. పవన్ కల్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అయ్యాక విడుదలవుతోన్న మొదటి సినిమా కావడంతో అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. దిగువ తరగతి రూ.100, అప్పర్ క్లాస్ రూ.150, మల్టీప్లెక్స్ రూ.200 అదనంగా పెంచుకోవడానికి అనుమతి లభించడంతో సినిమా టిక్కెట్ల ధరలు సింగిల్ స్క్రీన్‌లో బాల్కనీ రూ.250, మధ్య తరగతి రూ.150-190, మల్టీప్లెక్స్‌లలో రూ.350దాకా ఉండబోతున్నాయి.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

సందేశంతో రాజు గాని సవాల్



లెలిజాల రవీందర్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'రాజు గాని సవాల్'. రితికా చక్రవర్తి కథానాయిక. రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మీ పిక్చర్స్ ద్వారా విడుదలకు సిద్ధమవుతోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లెలిజాల రవీందర్ మాట్లాడుతూ 'నా జీవితంలో జరిగిన కొన్ని నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కల్చరల్ ఈవెంట్స్ నేపథ్యంలో కథ సాగుతుంది. ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం ఇచ్చే చిత్రమిది' అని తెలిపారు. నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'సినిమా టీజర్ చూశాం చాలా బావుంది. ఇప్పుడు ట్రైలర్ కూడా ఆకట్టుకుంటోంది. రవీందర్ కొత్తతరహా కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను అలరిస్తుంది' అని అన్నారు.

సామ్రాజ్య టైటిల్‌తో



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం ఈ నెల 31న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న విషయం తెలిసిందే. శనివారం చిత్ర బృందం హిందీ టైటిల్‌ను ప్రకటించింది. అక్కడ ఈ చిత్రాన్ని 'సామ్రాజ్య' పేరుతో హిందీలో విడుదల చేస్తున్నారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సంగీతం: అనిరుధ్



ఎస్. జే సూర్య కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కిల్లర్'. వీసీ ప్రవీణ్, బైజు గోపాలన్ కలసి నిర్మిస్తున్నారు. ప్రీతి అస్రాని కథానాయిక. ఇటీవలే చిత్రీకరణ మొదలైంది. శనివారం చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గన్ పట్టుకొని, ప్రీతి అస్రానీని భుజాన ఎత్తుకున్న లుక్ ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

ఫిష్ వెంకట్‌కు ప్రముఖుల నివాళి



నటుడు ఫిష్ వెంకట్ శుక్రవారం రాత్రి మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమ ఓ విలక్షణ నటుడిని కోల్పోయిందని అన్నారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, టి. పద్మారావు గౌడ్, నటి కరాటే కల్యాణి, కమెడియన్ రచ్చ రవి తదితరులు శనివారం ఉదయం అడ్డగుట్టలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

అడ్డగుట్ట (ఆంధ్రజ్యోతి)

విద్యార్థి దశ సద్వినియోగంతోనే ఉజ్వల భవిష్యత్తు

● జస్టిస్ జ్యోతిర్మయికి విజయలక్ష్మి స్మారక పురస్కారం



జస్టిస్ జ్యోతిర్మయి, శ్రీనివాస్ దంపతులను విజయలక్ష్మి పురస్కారంతో సత్కరిస్తున్న వీసీలు శివరామకృష్ణ, కృపాచారి, సత్యనారాయణ

తెనాలి అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశను సద్వినియోగం చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయి ప్రతాప పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో.. జ్యోతిర్మయి, శ్రీనివాస్ దంపతులను విజయలక్ష్మి స్మారక పురస్కారం ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. సమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో విద్యార్థులు-భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై న్యాయమూర్తి మాట్లాడారు. ఓటమి అనేది శత్రువుల వల్ల రాదని, మనసులో భయం ఉంటేనే వస్తుందన్నారు. జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, దళిత సార్వత్రిక విశ్వ విద్యాలయం వీసీ గుజ్జర్లమూడి కృపాచారి, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ ప్రసంగించారు. పదవ తరగతి పరీక్షల్లో 550కి పైగా మార్కులు సాధించిన 60 మంది విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈదర వెంకటపూర్ణచంద్, ప్రసాద్, నాగభూషణం, తాతాజీ, ఈశ్వర్‌చంద్, జగదీశ్వరి, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

ప్రజల్లో విషబీజాలు నాటేందుకు వైసీపీ పన్నాగం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గా లను అప్పనంగా దోచుకున్న వైసీపీ దొంగల ముఠా ప్రజల్లో విషబీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నా రని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ఆరోపించారు. చిలకలూరిపేట మండలం కావూరు, కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్లు, రూ.10లక్షలతో గ్రావెల్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసి, కోమటినేనివారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో రూ.3 లక్షలతో నిర్మించిన తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ నిన్నటి రోజున వైసీపీ దొంగల ముఠా అంతా చిలకలూరిపేటకు వచ్చి పచ్చి అబద్దాలు ఆడిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరీముల్లా, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, కందుల రమణ, అరెకట్ల కోటేశ్వరరావు, కావూరు రమేష్ పాల్గొన్నారు.



మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత విద్యాశాఖాధికారి మృతి

పిట్టలవానిపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విశ్రాంత విద్యాశాఖాధికారి శనివారం మృతి చెందారు. పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన వేగేశన వెంకటేశ్వరరాజు (77) ద్విచక్ర వాహనంపై జీఎస్‌పాలెం గ్రామంలో ఓ శుభకార్యాయానికి వెళ్లి వస్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఆయనను ఢీకొంది. వెంకటేశ్వరరాజు గతంలో విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి, 2006లో ఉద్యోగ విరమణ పొందారు. చందోలు ఎస్సై ఎం.వెంకటశివకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

● డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు



ప్లాస్టిక్ బాటిళ్లు తొలగిస్తున్న చైర్మన్ మక్కెన, జంగా తదితరులు

గుంటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పేర్కొన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ప్లాస్టిక్ నిషేధంపై ఉద్యోగులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మానవహారం నిర్వహించారు. బ్యాంకు ఛైర్మన్ మక్కెనతో పాటు టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, బ్యాంకు మాజీ ఛైర్మన్ మానం వెంకటేశ్వర్లుతో కలిసి ఉద్యోగులు బ్యాంకులోని ప్లాస్టిక్ బాటిల్స్ ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఛైర్మన్ మక్కెన మాట్లాడుతూ పరిపాలన కార్యాలయంలో ఉద్యోగులందరికి తన ఖర్చుతో స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందజేస్తానని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో అజయ్‌కిషోర్, జీఎంలు కృష్ణవేణి, ఫణికుమార్, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర బ్యాంక్ నోడల్ అధికారులు మాధవి, కె.బాలాజీ ప్రసాద్ తదితరులున్నారు.

పెట్రోల్ దాడి కేసులో నిందితుడికి రిమాండ్

నూజెండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసి నిప్పంటించడంతో మహిళ మృతికి కారణమైన నిందితుడికి కోర్టు శనివారం రిమాండ్ విధించింది. వివరాల మేరకు.. ఐనవోలు గ్రామంలో ఈ నెల 16న ఆరుబయట నిద్రిస్తున్న దంపతులపై నీలబోయిన యలమంద పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో నీలబోయిన మంగమ్మ మృతి చెందింది. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ బీవీ కృష్ణారావు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ నిర్వహిస్తున్నామన్నారు.

పల్నాడును ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

కలెక్టర్ అరుణ్‌బాబు



కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పల్నాడును ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. శనివారం నరసరావు పేటలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎంతో ముఖ్యం అన్నారు. ప్రధానంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడడం ఆపి జూట్ బ్యాగులను వినియోగించాలని సూచిం చారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, జూట్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన, ప్రత్యామ్నాయాల వినియోగంపై అవగాహన కల్పించే దిశగా ప్రయత్నిస్తాననని విద్యార్థులు, ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. పారిశుద్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఆర్డీవో ఎం.హధు లత, మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు పాల్గొన్నారు.

మాచవరం పెట్రోల్ బంకులో తనిఖీలు



మాచవరం బంకులో పెట్రోల్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌వో ప్రసాదరావు

మాచవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మాచవరం పెట్రోల్ బంకులో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, సత్తెనపల్లి తూనికలు, కొలతలు అధికారి జాన్ సైదా శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ బంకులో శుక్రవారం పెట్రోల్‌కు బదులు నీళ్లు కొట్టారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో.. అధికారులు స్పందించారు. బంకులో ఉన్న పెట్రోల్‌ను పరిశీలించగా.. నీళ్లు లాగా వస్తుండటం గమనించారు. సేల్స్ ఆఫీసర్ తనిఖీ చేసి పంపుల ద్వారా వచ్చే పెట్రోల్ నాణ్యతను నిర్ధారించాల్సి ఉందని డీఎస్‌వో తెలిపారు. తూనికలు, కొలతల అధికారి జాన్ సైదా లీటర్ల పరిమాణం పరిశీలించారు. అనంతరం డీఎస్‌వో ప్రసాదు పెట్రోల్ బంకు రికార్డులు తనిఖీ చేయగా స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసాలు లేవని తెలిపారు. పెట్రోల్ బంకుకు సంబంధించి నివేదిక తయారు చేసి, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సమర్పించనున్నట్టు పేర్కొన్నారు. తనిఖీల్లో స్థానిక తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, డీటీ స్రవంతి, డీఎస్‌వో ఆఫీస్ డీటీ ప్రభాకరరావు, ఆర్ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సురేష్ చంద్



స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ చంద్

సత్తెనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని, అందుకు సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సురేష్ చంద్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఏరియా వైద్యశాలలో నిర్వహించారు. డైరెక్టర్ సురేష్ చంద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, వాటర్ బాటిల్స్ వాడ కూడదన్నారు. ఏరియా వైద్యశాలలో డాక్టర్లతో కలసి మొక్కలు నాటారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, డాక్టర్లు లక్ష్మణరావు, ఆర్ఎంవో రాధాకృష్ణ, పలువురు డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఏరియా వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పురపాలక సంఘ డీఈ మధుసూదనరావు ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన విధివిధానాలు బహిర్గతం చేయాలి

● బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రం జనగణనతో పాటు చేపడుతున్న సమగ్ర కుల గణన విధి విధానాలు బహిర్గతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం నరసరావుపేటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జనగణన అనంతరం ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరారు. స్థానిక సంస్థల్లో 34 శాతం, చట్టసభలలో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చేలా కూటమి సర్కార్ ఎన్నికల వాగ్దానం ఇచ్చిందని గుర్తుచేశారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీం కోర్టు పరిమితిని అధిగమించేలా రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, సుతారం విశ్వేశ్వరరావు, గాలి సాంబశివరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు తదితరులు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 565.00 అడుగులు ఉంది. ఇది 244.14 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1,800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 1800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 67,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 13.35 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,622 క్యూసె క్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

కాలుష్య రహిత సమాజం కోసం స్వచ్ఛాంధ్ర

జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా

గుంటూరు సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజం కోసమే కూటమి ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసిందని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా పేర్కొన్నారు. శనివారం జడ్పీ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఐటీసీ సంస్థ అందజేసిన గుడ్డ సంచులు పంపిణీచేశారు.సీఈఓ జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	113, 121, 132
చికెన్ విత్ స్కిన్(కిలో)	216.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	226.00



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

కాల్వల ఆధునికీకరణతో చివరి భూములకు సాగునీరు

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో గురజాల నియోజకవర్గంలో వున్న మేజర్, మైనర్ల మరమ్మతులను 90 శాతం పూర్తిచేశామని, మరో వారం రోజుల్లో మిగిలిన పనులు పూర్తిచేసి సాగునీటి విడుదలకు అడ్డంకి లేకుండా చేస్తామని ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సాగునీటి సలహా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని గురజాల నియోజకవర్గంలో వున్న మేజర్లు, మైనర్లు గతంలో వున్న దుస్థితి.. ఇప్పుడున్న వాటి స్థితిగతులను వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. వెల్దుర్తి మండలంలోని మరసపెంటకు చెంది న మూఢావత్ గోపినాయక్‌కు రూ.1.80లక్షలు, రమావత్ పార్వతిబాయికి రూ. 1.83 లక్షలు చెక్కులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేత వజ్రం నాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● నకరికల్లు, జూలై 19(ఆంధ్రజ్యోతి): కుంకలగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో (జెడ్పీ) మధ్యాహ్న భోజన పథకం అమలును తహసీల్దార్ కే పుల్లారావు పరిశీలించారు. మెను ప్రకారం పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.ప్రభాకర్‌బాబు, సింగరాజు అంకారావు, మాలపాటి మహంకాళిరావు, ఆవుల సుబ్బయ్య పాల్గొన్నారు.

● రాజుపాలెం: జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి ఏపీడీ వీవీ నారాయణ అన్నారు. శనివారం రాజుపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ కూలీల మస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

● సత్తెనపల్లి: కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు సత్తెనపల్లిలోని కాకతీయ కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని ప్రతిభగల విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ చేస్తున్నట్లు కన్నా కార్యాలయవర్గాలు శనివారం తెలిపాయి.

● క్రోసూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఏడీఏగా పీ మస్తానమ్మ నియమితులయ్యారు. ఆమె నరసరావుపేట రూరల్ ఏడీఏగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఉన్న వీ హనుమంతరావు పల్నాడు జిల్లా వ్యవసాయ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

● బెల్లంకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెంకి చెందిన పి.బసవాయమ్మ మృతికి పార్టీకే తీరని లోటని టీడీపీ మండల నాయకుడు వెన్నా సీతారామిరెడ్డి అన్నారు. శనివారం బసవాయమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● పెదకూరపాడు: ఈనెల 20వ తేదీ అమరావతిలో సీపీఐ 16వ మహాసభను నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పెదకూరపాడులో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాల్గొన్నారు.

● పెదకూరపాడులోని అంకమ్మ తల్లి దేవాలయ కమిటీని నూతనంగా ఏర్పాటుచేసినట్టు ఆలయ పూజారి గంగాధర్ శనివారం తెలిపారు. అధ్యక్షులుగా బెల్లంకొండ శ్రీధర్, ఉపాధ్యక్షులుగా దుప్పటి చినబాబు, కార్యదర్శిగా కరణం శ్రీనివాసరావు, కోశాధికారిగా అర్తిపట్ల వీరాంజనేయులు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వివరించారు.

● రెంటచింతల: రెంటచింతల పీఏసీఎస్ అధ్యక్షుడిగా జి. లక్ష్మీమల్లారెడ్డిని నియమిస్తూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం ప్రకటించారు. డైరెక్టర్లుగా చేర్రెడ్డి రామలక్ష్మి, గొట్టం నాగిరెడ్డిలను నామినేట్ చేశారు.

● ఇప్పటిదాకా గురజాల గ్రూప్‌లో వున్న పాలువాయి గ్రామంలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాన్ని రెంటచింతల గ్రూప్‌లో చేరుస్తూ దేవదాయశాఖ డీసీ కె.బి.శ్రీనివాసరావు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈవో రామిరెడ్డి చెప్పారు.

గురజాలలో భారీ వర్షం

గురజాలటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. మండల పరిషత్ కార్యాలయ ఆవరణ, ముందు భాగం వర్షపునీటితో నిండింది. రజక వీధిలో డ్రైనేజీ నీరు రోడ్డుపై పారింది. మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు, ఎక్సైజ్ కార్యాలయం చుట్టూ వర్షపునీరు చేరింది. లక్ష్మీ టాకీస్ సెంటర్లో, గుంటూరు - మాచర్ల ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు చేరింది.

డెంగీ మాసోత్సవ ర్యాలీ

మాచర్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడకలో శనివారం మాచర్ల సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య ఆధ్వర్యాన డెంగీ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మురళీధర్, వాగ్యానాయక్, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకే ప్రాధాన్యం

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు



పిడుగురాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు, కూటమి నాయకులు



మాచవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పిడుగురాళ్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పట్టణాలు, పల్లెలు పరిశుభ్రంగా వుంచడమేనని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. 3వ శనివారం పిడుగురాళ్లలో మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, కమిషనర్ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామితో పాటు పలువురు కూటమినేతలు ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, పిల్లి చెన్నారావు, ఫరీద్ మేస్త్రి, దూదేకుల ఖాశింసైదా, పణితి రవి, మెప్మా టిఎంసి శ్రీనివాస్, దేవళ్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ పరిధిలో అన్ని గ్రామాలలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాణి, ఈఓపీఆర్డీ దయాకర్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

దాచేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మూడో శనివారం సందర్భంగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పినాకపాణి, హెచ్ఎం సాంబయ్య, రెవెన్యూ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు ప్రతిజ్ఞ పూనారు. దాచేపల్లి మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలనపై స్థానికులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో గబ్రూ నాయక్, ఎంపీడీవో వీరయ్య, ఎంపీపీ జాన్, ఈవోపీఆర్‌డీ గుప్తా, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీలు

మాచవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలంటూ పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశించారు. దీనిలో భాగంగా అన్ని గ్రామాల్లో ప్రతిజ్ఞ చేపట్టారు. పిన్నెల్లి గ్రామంలో డిప్యూటీ ఎంపీడీవో వెంగళరావు చిల్లర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం

సుపరిపాలన-తొలిఅడుగులో టీడీపీ నేతలు



నరుకుళ్లపాడులో కరపత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఏ ప్రవీణ్

అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం శనివారం మండలంలోని నరుకుళ్లపాడు గ్రామంలో జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ప్రవీణ్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలను పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మంచినేని రాజా, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు భాష్యం జగదీష్, నాగోతు నాగార్జున, బి.సూర్యనారాయణ స్థానిక నాయకులు వెంకట్రావు, గిరిధర్ పాల్గొన్నారు.

● బెల్లంకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని పాపాయపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రసాదు, టీడీపీ నాయకులు గడప గడపకు వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్కల కోటిరెడ్డి, ఓర్సు వెంకటేశ్వర్లు, వెంకటరావు, బ్రహ్మారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, షేక్ మస్తాన్ షరీఫ్, మునీర్, షేక్ దిలీప్, పొట్టి శ్రీనివాసరావు, నట్టా కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించండి..



బెల్లంకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



అచ్చంపేట: ప్రతిజ్ఞ చేస్తున్న మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు

అచ్చంపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తూ జూట్ కవర్లను వాడాలని అచ్చంపేటలో ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం ర్యాలీ నిర్వహించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి ఆంజనేయుని విగ్రహం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అచ్చంపేట మెయిన్ సెంటర్‌లోని కిరాణా షాపులు, కూరగాయలు, ఇతర వ్యాపారసంఘాల షాపుల వద్దకు వెళ్ళి ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని వివరించారు. సమీపంలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను రోడ్డు మీద వేసి కాల్చారు. పర్యావరణాన్ని రక్షించాలంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు, నాయకులు వెనిగండ్ల కోటయ్య, యడ్లపల్లి బుచ్చిబాబు, సర్పంచ్ ఎస్‌కే జానీ, కోటా చంటి, పీఎస్ పంతులు నాయక్, ఏపీవో పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

బెల్లంకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ కవిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి హాని చేస్తుందన్నారు. కాలుష్యం వల్ల క్యాన్సర్ వ్యాధి సోకుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లక్ష్మీ సులోచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి



మార్కెట్ యార్డు ఆవరణలోని చెత్తను ఊడుస్తున్న చైర్మన్ శోభారాణి, యార్డు సిబ్బంది

సత్తెనపల్లి రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. యార్డు ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. కార్యక్రమంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, యార్డు డైరెక్టర్లు పోతుగంటి రామకోటేశ్వరరావు, పాటిబండ్ల పూర్ణచంద్రరావు, యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాలతో గ్రామాలకు ఆదాయం

● సత్తెనపల్లి డీఎల్‌డీవో వై రాజగోపాల్

నకరికల్లు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మి కంపోస్టును తయారుచేయటం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం లభిస్తుందని సత్తెనపల్లి డీఎల్‌డీవో వై రాజగోపాల్ తెలిపారు. శనివారం నరసింగపాడులోని సంపదతయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు పల్నాడు జిల్లాలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో నకరికల్లు మండలం ప్రథమస్థానంలో నిలిచిందని తెలిపారు. తడి, పొడిచెత్తను ఇంటివద్దనే వేరు చేయాలన్నారు. నరసింగపాడులో వెయ్యి కిలోల వర్మికంపోస్టు అమ్మకానికి సిద్ధంగా ఉంచటం పట్ల పంచాయతీ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు అభినందించారు. సంపద తయారీ కేంద్రం వద్ద నిర్వహించాల్సిన రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ కాశయ్య, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదు, పీఎస్ కె.అప్పారావు, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



నకరికల్లు: నరసింగపాడులో ఎరువును పరిశీలిస్తున్న సత్తెనపల్లి డీఎల్‌డీవో వై రాజగోపాల్



రాజుపాలెం: ర్యాలీ నిర్వహిస్తున్న మండలాధికారులు, సిబ్బంది

● రాజుపాలెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామంటూ రాజుపాలెం మండల అధికారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని విక్రయించినా, ఉపయోగించినా రూ.5వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యానారాయణ, డీటీ జానీ బాషా, ఈవోపీఆర్డీ పి.ముక్కంటి, ఎంఈవో మల్లికార్జునశర్మ, నరసింహరావు, ఏపీ ఎం శివకుమార్, ప్రసాద్, సర్పంచ్‌లు, పీఎస్‌లు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ పర్యావరణ హితులై ఉండాలి

● ఎస్ఈ వెంకటరమణ



మాచర్ల: ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఈ వెంకటరమణ

రెంటచింతల, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పర్యావరణ హితులై ఉండాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిరోధించాలని, పర్యావరణం కలుషితం కావడం వలన కలిగే అనార్థాల ను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణ కోరారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణం కాపాడతామని ఉద్యోగులు, కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఎంపీడీవో శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్ ప్రిన్సిపల్ మోహన్‌ఆధ్వర్యాన వీధుల్లో ర్యాలీ జరిపారు.

● దుర్గి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. దుర్గిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులు గ్రామంలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డబ్బాల్లో నింపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారులు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కారంపూడిలో అంబేడ్కర్ గురుకులంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనార్థాలను వివరించారు. అనంతరం భారీ ర్యాలీ జరిపి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తేజ్ స్వరూప్, సీహెచ్‌వో మల్లయ్య, హౌసింగ్ ఏఈ బాబురావు, లాలునాయక్, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కారంపూడిలో నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ర్యాలీ

న్యాయమూర్తిని కలిసిన పిడుగురాళ్ల బార్ అసోసియేషన్



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి తదితరులు

పిడుగురాళ్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తిని శనివారం పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి మర్యాదపూర్వకంగా గుంటూరులో కలిశారు. పిడుగురాళ్లకు నూతన కోర్టు భవనం నిర్మించుటకు కృషి చేసిన జిల్లా న్యాయమూర్తికి బార్ అసోసియేషన్ తరుపున కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ఒక పోలింగ్ కేంద్రంలో 1200 మంది ఓటర్లు మాత్రమే

నకరికల్లు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రానున్న సాధారణ ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రంలో 1200 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొనేలా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్నట్టు తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. శనివారం కుంకలగుంటలో గల రెండు పోలింగ్‌కేంద్రాల్లో 1200మందికి పైగా ఓటర్లు ఉన్నారు. అదనపు ఓటర్లకు కొత్త పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయటం గాని చేస్తామని తహసీల్దార్ తెలిపారు. వీఆర్‌వో ఆవుల కృష్ణకుమారి, షేక్ సైదా పాల్గొన్నారు.



కుంకులగుంట జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కే పుల్లారావు

మున్సిపల్ కార్మికుల నిరసన

పిడుగురాళ్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల నిరసన శనివారం 7వ రోజుకు చేరింది. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో మున్సిపల్ కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.శ్రీను, ఎం.నాగేశ్వరరావు, రత్నబాబు, రమేష్, విజయ్, పవన్, విజయసారథి, శ్రీను, రామారావు, గురవయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి పాల్గొన్నారు.



రాయితీపై విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రైతులకు మేలు చేయటమే లక్ష్యం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, జూలై 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాలను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పనిచేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం నకరికల్లులో నూరు శాతం సబ్సిడీపై కందులు, మినుములను రైతులకు అందజేశారు.

● అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రూ 78 లక్షల అభివృద్ధి పనులను చేసినట్టు కన్నా తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, నాగోతు శౌరయ్య, షేక్ అలీ బాషా, తోట అంబిక, పూజల వెంకట కోటయ్య, సాగి శ్రీను, షేక్ అహమ్మద్, కరాలపాటి వలి, వేల్పుల ఆవుల రాజు, బత్తుల అప్పారావు, బత్తుల జానకి రామయ్య, జోసెఫ్, డీఎల్‌డీవో వై రాజగోపాల్, ఎంపీడీవో కాశయ్య, ఈవోఆర్‌డీ ప్రసాదు, ఏవో కే దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మరియబాబు

రాజుపాలెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మురికిపూడి మరియబాబు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం మరియబాబు మాట్లాడుతూ తన నియమకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కన్నా, టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఎస్సీ విభాగంలో టీడీపీ ఓటు బ్యాంక్ పెరిగేలా చూస్తానన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

● జిల్లా కో-ఆర్డినేటర్ శివకుమారి

పిడుగురాళ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగానే ఎరువులను వాడాలని రైతు శిక్షణా కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ ఎం శివకుమారి తెలిపారు. శనివారం వీరాపురం గ్రామంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడుతున్నారని, దీని ద్వారా భాస్వరం ఉపయోగపడకపోగా పోషకలోపాలు వస్తున్నాయని తెలిపారు. మెట్టపంటలకు విత్తిన నెలరోజుల లోపు వరి నాటిన పది రోజుల లోపు కాంప్లెక్స్ ఎరువులను తగిన మోతాదులో వాడాలన్నారు. ఏఓ సంధ్యారాణి మాట్లాడుతూ పీఎం ప్రణమ్ పథకం కింద సేంద్రియ, జీవన ఎరువులను వాడి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తే కంపెనీ వారికి వెళ్లే రాయితీలు మన రాష్ట్ర ప్రభుత్వానికి వస్తాయన్నారు. తద్వారా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయన్నారు. వీరాపురంలో సాగుచేయబోయే వరి, పత్తి, మిరప పంటలలో యాజమాన్య పద్ధతులను వివరించారు. పంటల బీమా గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, వీఏఏ రాజశేఖర్, నరసయ్య, ప్రియాంక, గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల హర్షం

సత్తెనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం స్థలం కేటాయించటం పట్ల శనివారం పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయనుండటం ఎంతో అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ఆర్యవైశ్య నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొల్లిపర కాశీవిశ్వనాథం, కందకట్ల శంకర్, బచ్చు వెంకటేశ్వర్లు, అన్నం బాలసుబ్రహ్మణ్యం, కళ్యాణ్, జవ్వాజి రామ్మోహనరావు, దేవతి సుబ్బారావు, పీ రామకోటేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

సత్తెనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని అదానికి, ఆర్టీసీ స్థలాలను లూలూ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం కట్ట బెడుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. శనివారం పట్టణంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదాని ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మోదీకి తలొగ్గి స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని చేసుకుందన్నారు. అదే విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ 750 కోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపిందన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తామన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య, నాయకుడు గుంటూరు విజయ కుమార్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

టీడీపీ పట్టణ అధ్యక్షుడు దుర్గారావు

మాచర్లటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు అన్నారు. శనివారం పట్టణంలోని 9వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలను సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు ఆదినారాయణ..

కారంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పేదల ప్రజల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడు ఆదినారాయణ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని శనివారం ఆదినారాయణ 19వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, మేకపోతు శ్రీనివాసరెడ్డి, గురజాల ఏరియా కార్యదర్శి రమణారెడ్డి, సైదా, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ యువనేత గౌతమ్‌రెడ్డి

మాచర్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే చేనేతలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నేరేటి వీరాస్వామి యాదవ్, మద్దిగపు పెద వెంకట్రామిరెడ్డి, చిన వెంకట్రామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



చేనేతల సమస్యలను తెలుసుకున్న టీడీపీ యువ నేత గౌతమ్‌రెడ్డి

పల్నాడు వార్తలు

డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్‌పై పనిచేసేందుకు అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఐడీ, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన అధ్యాపకులు మరలా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా సెలక్షన్ కమిటీ వీరిని నియమిస్తారన్నారు.

నాణ్యమైన విద్యా బోధన చేయాలి

● డీఈవో చంద్రకళ

నాదెండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని డీఈవో చంద్రకళ అన్నారు. మండలంలోని సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయినులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యాబోధన సక్రమంగా ఉంటేనే విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. మండలంలోని గణపవరం, నాదెండ్ల, చిరుమామిళ్ళ, ఎండుగుంపాలెం గ్రామాల్లో కూడా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో ఎంఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

బీజేపీ జిల్లా కమిటీ నియామకం

నరసరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కమిటీని నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యక్షుడిగా ఇత్తడి కిరణ్, కామినేని హనుమంతరావు, గొడవర్తి సుజాత, గోగినేని వెంకటరమణ, బీ శ్రీదేవి, జే బ్రహ్మయ్య నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శు లుగా కే సుబ్బారావు, శెట్టి హనమంతరావులను నియమించారు. కార్యదర్శులుగా జే లక్ష్మీ, జీ హనుమకుమార్, కే జాన్‌బాబు, బీ సులోచన, జీ లక్ష్మీ, ఎం శివ రత్నకుమార్. ఎస్ పుల్లారెడ్డి, కే ఆంజనేయులు, ఐటీ కన్వీనర్‌గా రామిశెట్టి యశ్వంత్, సోషల్ మీడియా కన్వీనర్‌గా వంకాయలపాటి వంశీని నియమించారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నూజెండ్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీ ఉమాదేవి శనివారం తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

విద్యుత్ లైన్ ఏర్పాటుకు నిధుల కేటాయింపు

వేల్పూరు(శావల్యాపురం), జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంటవారిపాలెం నుంచి వేల్పూరుకు వెళ్లే మార్గంలోని వై-జంక్షన్ వరకు కొత్తగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ లైన్‌కు వేల్పూరు పంచాయతీ నుంచి రూ.5.30లక్షలు నిధులు కేటాయించినట్లు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ శనివారం తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యుద్దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో గంటవారిపాలెం నుంచి వేల్పూరు జడ్పీ పాఠశాలకు ప్రైవేటుకు వెళ్లే విద్యార్థులు, మహిళలు, ప్రయాణికులు ఈ మార్గంలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై కాంట్రాక్టర్‌తో మాట్లాడామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీ

వినుకొండటౌన్ జూలై 19, (ఆంధ్రజ్యోతి) మండలంలోని అందుగుల కొత్తపాలెంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం నాటు సారా తయారు చేసి, తాగిన నేరమని, సారా తాగుట వలన కలిగే అనార్థాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం పరిశీలన

నాదెండ్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): కొత్త మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ రమేష్‌బాబు, తహసీల్దార్ చంద్రశేఖర్‌లు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడారు. జరుగుతున్న కొనుగోళ్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆటో రిక్షా డ్రైవర్లకు అవగాహన

నరసరావుపేట రూరల్, చిలకలూరిపేట, జూలై 19, (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మోటార్ వాహన తనిఖీ అధికారి కార్యాలయంలో శనివారం ఆటో రిక్షా డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు పల్నాడు జిల్లా రవాణా శాఖ అధికారి జి.సంజీవ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట పట్టణ ఎస్‌ఐ డి.చెన్నకేశవులు, మోటార్ వాహన తనిఖీ అధికారి ఎన్ గోపాల్ పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలు రవాణా చట్టం పాటించాల్సినవి, పాటించకూడనివి వివరించినట్లు ఆయన తెలిపారు.

స్మార్ట్ మీటర్ల పై అపోహలు వద్దు

నర్సరావుపేట రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లపై ఎటువంటి అపోహలకు లోను కావద్దని పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శనివారం ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ మీటర్లు ప్రస్తుతం ఉన్న మీటర్ల వంటివేనన్నారు. వాటికి అదనంగా సమాచార మార్పిడి సదుపాయం ఉంటుందన్నారు. కచ్చితంగా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

రొంపిచర్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు, రెడ్డిపాలెం గ్రామాల్లో జడ్పీ పాఠశాలలు, ఏపీ మోడల్ పాఠశాలలు శనివారం ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. జూలై నెలలో పూర్తి చేయాల్సిన సిలబస్, విద్యాబోధనలో మెళకవలు, విద్యార్థులను చురుగ్గా ఉంచటం, పాఠశాలలోని వసతుల గురించి వివరించారు. ఎంఈవో బ్రహ్మేశ్వరరావు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

ఎంపీడీవో కార్యాలయం పాతభవనం


ఈపూరు ఎంపీడీవో కార్యాలయం పాత భవనం

ఈపూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈపూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయం పాతభవనం అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే మందుబాబులు భవనంలో చేరిపోతారు. పాతభవనం ఎప్పుడు పడిపోతుందో భయపడుచున్న తరుణంలో నూతన భవనం నిర్మించి కార్యకలాపాలన్నీ అక్కడే నిర్వహిస్తున్నారు. కార్యాలయం భవనాల చుట్టూ ప్రహారీ లేకపోవడంతో అసాంఘీక కార్యక్రమాలు జరిపే వాళ్ళు పాడుబడిన భవనాన్ని వాళ్ళ పనులకు ఉపయోగించుకుంటున్నారు. అక్రమార్కులు కొందరు కార్యాలయానికి చెందిన స్థలాన్ని ఆక్రమించుకొని శాశ్వత కట్టడాలను నిర్మించుకున్నారు. ప్రతిరోజు చీకటిపడితే పదుల సంఖ్యలో భవనంలో అసాంఘీక కార్యక్రమాలు నడుపుతున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణలోనే ఎంఈవో, వెలుగు, భవిత కార్యాలయాలు ఉన్నాయి. పాత భవనం కూలడానికి సిద్ధంగా ఉండటంతో అటువైపు ఎవరు వెళ్లలేని పరిస్థితి. ఆక్రమణలను తొలగించి అక్కడ గదులను నిర్మించి అద్దెలకు ఇస్తే ఆదాయం వస్తుంది. దీంతో ప్రహారీ నిర్మించుకోవచ్చును. కార్యాలయానికి కాపలాదారుడిని నియమించవచ్చును. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చును. కాని అధికారులు, పాలకులు మాత్రం ఆక్రమణదారులు ఇచ్చే దానికి ఆశపడి ఆక్రమణలు తొలగించడానికి వెనకడుగు వేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇప్పుడు కూడా వారి ఆగడాలు మరీ ఎక్కువయ్యాయి. అసాంఘీక కార్యక్రమాలు కూడా వారి ఆధ్వర్యంలో నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుచున్న వారిని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ చిలకలూరిపేట

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
● పట్టణంలో స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర ర్యాలీ
● తోపుడుబండ్లు, డస్ట్ బిన్ల అందజేత


పారిశుధ్య సిబ్బందికి తోపుడుబండ్లు, డస్ట్ బిన్లను అందచేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 100కు పైగా మున్సిపాలిటీలలో చిలకలూరిపేట మున్సిపాలిటీ స్వచ్ఛాంధ్ర ర్యాంకుల్లో 15వ స్థానంలో నిలిచిందని, అందుకు కారణమైన అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లను అభినందిస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. పట్టణంలో జరిగిన స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెత్తసేకరణ నిమిత్తం రూ.4 లక్షలతో కొనుగోలు చేసిన తోపుడు బండ్లు, డస్ట్ బిన్లను మున్సిపల్ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ శానిటరీ విభాగంలో బాగా పనిచేసిన కార్మికులను అభినందించి సత్కరించారు. ప్రజలతో కలిసి స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రత్తిపాటి ప్రజల సహకారంతోనే స్వచ్ఛ చిలకలూరిపేట సాధ్యమవుతుందన్నారు. కాలువలు, రోడ్లు ఆక్రమించిన వారు తక్షణమే ఆక్రమణలు తొలగించాలని కోరారు. కాలువలపై ఆక్రమణలు పెరగడంతో మురుగునీటి సరఫరాకు కూడా అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. పట్టణంలో సేకరించే చెత్తను నిత్యం వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లకు తరలిస్తున్నారని, డంపింగ్ యార్డ్‌లను కూడా సుందరీకరించే పనులు చురుగ్గా జరుగుతున్నాయని చెప్పారు. ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ గోల్డ్ శ్రీను, కమిషనర్ పి.శ్రీహరిబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, రమణ, శివ పాల్గొన్నారు.

జగ్గాపురంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర

యడ్లపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో బాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులు, అధికారులు కలసి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలికి చేరుకున్న అనంతరం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేస్తామని, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. జగ్గాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, ఈవోపీఆర్డీ జాకీర్‌హుస్సేన్‌లు పాల్గొని ప్లాస్టిక్ వినియోం వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలు, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● నాదెండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని తహసీల్దార్ ఎస్ చంద్రశేఖర్ అన్నారు. నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులతో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలంతా నిషేధించాలి

● మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి


శావల్యాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

శావల్యాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో మూలె వెంకటరెడ్డి అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ శావల్యాపురం జడ్పీపాఠశాల్లోని విద్యార్థులతో కలసి ఇన్‌చార్జి సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, అధికారులు శనివారం ర్యాలీ నిర్వహించారు. మతుకుమల్లిలో సర్పంచ్ యలగాల బసవయ్య, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య, సచివాలయ ఉద్యోగులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈవోపీఆర్డీ సుగుణ, హెచ్‌ఎం విజయలక్ష్మి, స్టాఫ్‌సెక్రటరీ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, యాకోబు పాల్గొన్నారు.

● ఈపూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం ఈపూరులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలన ప్రత్యామ్నాయాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరు పాటుపడాలని ఎంపీడీవో వీ శ్రీనివాసరావు అన్నారు.స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో బాగంగా శనివారం ఈపూరులో ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం మెయిన్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంచయ్య, ఏపీఎం పుష్పరాజ్, ఈవోపీఆర్‌డీ రత్నం, పారిశుధ్య కార్మికు లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

వినుకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో పట్ట ణంలో మున్సిపల్, మెప్మా, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ షకీలాబేగం మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శనివారం కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శైలజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యానికి అంతం

వినుకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయం నందు ప్లాస్టిక్ కాలుష్యానికి అంతం కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యాలయ సిబ్బందితో పాటు పంచాయతీ సెక్రటరీలు, ఉపాధి హామీ సిబ్బందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుట్టారెడ్డి డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి, ఏవో రవి, ఐటీసీ అసిస్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రభాకర్, ఏసోబు, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్ టెక్నాలజీ ఇన్‌క్యూబేటర్స్‌తో ఏఎంరెడ్డి కళాశాల ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అట్లూరి శాంతిరెడ్డి, కేఎల్ టెక్నాలజీ ఇన్‌క్యూబేటర్ ఫౌండేషన్ ప్రతినిధులు

నరసరావుపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలతో విజయవాడ కేఎల్ టెక్నాలజీ ఇన్‌క్యూబేటర్ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున శనివారం తెలిపారు. ఈ ఒప్పందంతో విద్యార్థులకు స్టార్టప్‌లు, పరిశోధన, నూతన ఆవిష్కరణలతో అవగాహన పెరిగే అవకాశాలు లభిస్తాయన్నారు. కళాశాలల అభివృద్ధి దిశగా ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్ టెక్నాలజీ ఇన్‌క్యూబేటర్ ఫౌండేషన్ సీఈవో బాబు హరికృష్ణ లంక, ఏసీబీసీ కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ సీఈవో రమాకాంత్ వీ, డిప్లొమో ప్రిన్సిపాల్ కే కృష్ణారెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ పీ భార్గవభూషణరావు, అధ్యాకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ నివారణపై అవగాహన

నరసరావుపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమం జరిగిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఆఫీస్ పొల్యూషన్ డిపార్టుమెంట్ ఎనలిస్ట్ ఎడ్లపల్లి అనిల్‌కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్లాస్టిక్ వాడకం వల్ల మానవ జీవన విధానానికి పెనుప్రమాదం ఉందన్నారు. విద్యార్థులతో కాలుష్య నియంత్రణ బాధ్యతగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డీ యోగేశ్వరరావు, ఎం బాలకోటేశ్వరరావు, మల్లారెడ్డిబ, తిరుపలిరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో..

స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ప్లాస్టిక్ నిర్మూలన ప్రతిజ్ఞలు కేసానుపాల్లి పంచాయతీ కార్యదర్శి కే భార్గవ శ్యామ్ విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ అధికారి గంగాధరరావు, వలంటీర్లు, పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలలో..

స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారని ప్రిన్సిపాల్ ఎంఎస్ సుదీర్ తెలిపారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాససాయి, ఎం అనిల్‌కుమార్, పీఎస్ వీడీ మహేష్, ఎం రమేష్, ఐ సదాశివరెడ్డి, డాక్టర్ ఏ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు , వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల విస్తృత ప్రచారం

యడ్లపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో బాగంగా యడ్లపాడులోని 87వ బూత్ పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని ఆ పార్టీ నాయకులు శనివారం ఉధృతంగా నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అంతేగాకుండా మై టీడీపీ యాప్‌లో ప్రతి ఇంటిని నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమాచారం నేరుగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పలపాటి శ్రీనివాసరావు, రాచమంటి, చెన్నగోపి, బూత్ కన్వీనర్ బాజి, యూసఫ్, రఫి తదితరులు పాల్గొన్నారు.


ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట వాస్తవ్యులు బొలిశెట్టి వెంకట సుబ్బారావు ధర్మపత్ని రోహిణి (లేటు)గార్ల కుమారుడు బొలిశెట్టి చంద్రశేఖర రాంబాబు ధర్మపత్ని స్వప్న, ఆరుష్, అకిరా ఇస్సపాలెం గ్రామం నందు గల శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం రూ.లక్ష నగదుని ఆలయ కార్య నిర్వహణ అధికారి నలబోతు. మాధవీదేవికి అందజేశారు. శనివారం ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, అధికారులు దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కుంట భూములను పరిరక్షిస్తాం

● తహసీల్దార్ జీ రమేష్‌కుమార్


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

నూజెండ్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఐనవోలు రెవెన్యూ పరిధిలోని యోగిరెడ్డిపాలెం, సమీపంలోని కుంట పోరంబోకు భూములను పరిశీలించి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులు, రోడ్లు, వాగులు అన్యాక్రాంతం కాకుండా చూస్తామని, ప్రజలు తమవంతు బాధ్యతగా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు.

బ్రిడ్జి కోర్సు అమలు చేయాలి : ఎంఈవో

శావల్యాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేందుకు జూలై నెలాఖరు వరకు మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు బ్రిడ్జి కోర్సు అమలు చేయాలని ఎంఈవో పుసులూరి లలితకుమారి అన్నారు. శావల్యాపురం, మతుకుమల్లి జడ్పీ పాఠశాలల్లో శనివారం కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. శావల్యాపురంలో ఎంఈవో లలితకుమారి పాల్గొని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ బ్రిడ్జి కోర్సు, చతుర్విధా ప్రక్రియలు అమలు చేసే కొత్తగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులు, సెలవుల్లో అక్షరాలు మర్చిపోయిన విద్యార్థులు గాడిలో పడతారన్నారు. కాంప్లెక్స్ చైర్మన్‌లు విజయలక్ష్మి, మురళీమోహన్, సెక్రటరీ రాజారమేష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు


నూజెండ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

నూజెండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి పని చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని నూజెండ్లలో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసిందన్నారు. త్వరితగతిన పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ-4 కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. తద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా పలు రంగాల్లో విజయం సాధించి ఉన్నత స్థానంలో ఉన్నటువంటి వారి సహాయ సహకారంతో ప్రత్యక్షంగా పేదలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నూజెండ్ల, గుర్రపునాయుడుపాలెం సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి, ముండ్రు సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు గంగినేని బాబు, మాజీ డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకటరావు, టీడీపీ నాయకులు గంగినేని ఆంజనేయులు, జెడ్డా రామయ్య, రొడ్డా వీరాంజనేయరెడ్డి, గంగినేని బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా..

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ఎనిమిదో రోజుకు, పారిశుధ్య కార్మికుల సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్యే అరవిందబాబు సందర్శించారు. జీవో 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు పెంచాలని, గత సమ్మెకాలంలో చేసుకున్న ఒప్పందాల ను అమలు చేయాలనే డిమాండ్‌లను కార్మికులు ఎమ్మెల్యే దృష్టి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సానుభూతి వ్యక్తం చేస్తూ వారి డిమాండ్లను సంబంధిత అధికారులతో చర్చించి త్వరగా పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్, సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు అండగా సంగం డెయిరీ

● జోనల్ మేనేజర్ జానకి రామారావు

ఈపూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం సంగం డెయిరీ పథకాలను అందజేస్తుందని సంగం డెయిరీ జోనల్ మేనేజర్ మక్కెన జానకి రామారావు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో పాలుత్పత్తిదారుడు బండి కొండయ్య మృతి చెందాడు మృతుని కుటుంబసభ్యులకు డీవీసీ ప్రొడ్యూసర్ హెల్ఫేర్ స్కీం కింద రూ.50వేలు చెక్కు, రూ.10వేలు నగదును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులను ఆర్థికంగా ఆదుకునేందుకు అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాదెండ్ల రామకృష్ణ, నెల్లూరి శాంతారావు, కెల్లంపల్లి కోటివెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరి సహకారం అవసరం : ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ రాధిక

ఈపూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారం ఉండాలని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనలు వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అందుకోసం పారిశుధ్యం అభివృద్ధి పరచాలన్నారు. ఎంపీడీవో వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. ఉద్యోగులకు వారి హాజరును బట్టే జీతాలు చెల్లింపులు ఉంటాయన్నారు. ఆయాశాఖల అధికారులు వారివారి శాఖల్లో జరుగుతున్న పనుల గురించి వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గోలి బాగ్యలక్ష్మీ, తహసీల్దార్ ఏ నళిని, ఈవోపీఆర్‌డీ రత్నం, మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ర్యాలీ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నరసరావుపేట రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఈసీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. వందమంది ఎన్‌సీసీ విద్యార్థులు పట్టణంలోని బస్టాండ్ నుంచి కోట సెంటర్ వరకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రాజేష్‌బాబు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన 102 మంది విద్యార్థులు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నరసరావుపేట రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 102 మంది ప్రముఖ బహుళ జాతి సంస్థ సవాంటిస్ సొల్యూషన్స్‌లో ట్రెయినీ అనలిస్టులుగా ఎంపికైనట్లు కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.3లక్షలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల నిర్వాహకులు సిబ్బంది అభినందించారు.